అకాల వర్షం.. రైతులకు నష్టం

అక్కన్నపేటలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని కాపాడుకోవడం కోసం రైతుల తిప్పలు

అక్కన్నపేట, ఏప్రిల్ 22: మండలంలోని అంతకపేట, జనగామ, గుబ్బడి, కుందన్‌వానిపల్లి, రామవరం, అక్కన్నపేట, కట్కూరు గ్రామాల్లో మంగళవారం అకాల వర్షం కురిసింది. దీంతో కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో అరబెట్టిన ధాన్యం తడిసిముద్దయ్యాయి. అకాల వర్షంతో అపార నష్టం వాటిల్లింది. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని చూసి రైతులు విలపించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో జాప్యం జరుగుతుండటంతో పాటు వారం రోజులుగా అకాల వర్షాలు పడుతుండటంతో రైతుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అక్కన్నపేట మాజీ ఎంపీటీసీ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు ప్రకటనలో డిమాండ్ చేశారు.

పిడుగుపాటుకు గేదె మృతి

మిరుదొడ్డి, ఏప్రిల్ 22 :మండలంలోని ధర్మారంలో మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు పాడిగేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు గూల్ల భాగులు రోజు మాదిరిగానే తన పొలం వద్ద మంగళవారం సాయంత్రం పాడిబర్రెను పొలం వద్ద కట్టేసి ఇంటికి చేరుకున్నాడు. ఆ తర్వాత అకాల వర్షం కురిసి పిడుగు పడడంతో పాడిబర్రె అక్కడిక్కడే మృతి చెందింది.

అలిరాజ్‌పేటలో నేలకొరిగిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న అధికారులు

దెబ్బతిన్న పంటల పరిశీలన

జగదేవపూర్, ఏప్రిల్ 22 : మండలంలో సోమవారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు అలిరాజ్‌పేట, నిర్మల్‌నగర్, పీర్లపల్లి, ధర్మారం, ఇటిక్యాల, గొల్లపల్లి, దౌలాపూర్, కొండాపూర్,మాందాపూర్ గ్రామాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. మంగళవారం మండల వ్యవసాయ అధికారి వసంతరావు, ఉద్యాన అధికారి రమేశ్, విస్తరణ అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. 9 గ్రామాల్లో రాళ్లవాన పడిందన్నారు. 1295 ఎకరాల్లో వరి, 180 ఎకరాల్లో మొక్కజొన్న, 105 ఎకరాల్లో మామిడి తోటలు, 5 ఎకరాల్లో కూరగాయల పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో విస్తరణ అధికారులు ఖలీల్, సమత, భానుప్రకాశ్, కవిత, రైతులు ఉన్నారు.

పోషకాహార లోపాన్ని నివారించాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్

గజ్వేల్, ఏప్రిల్ 22: ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు కలిసికట్టుగా పనిచేసి పోషకాహార లోపాన్ని నివారించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఐవోసీ కార్యాలయాల సమావేశ మందిరంలో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. పౌష్టికాహారంపై అందరికీ అవగాహన కల్పించాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సక్రమంగా పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో సరిత, తహసీల్దార్ శ్రవణ్, మెడికల్ అధికారులు బాలబీర్‌సింగ్, ప్రణయ్, సత్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో...

సిద్దిపేట, ఏప్రిల్ 22: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సీడీపీవో శారద అన్నారు. సిద్దిపేటలోని 6, 27వ వార్డుల్లో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్లు సాయికుమార్, నాగరాజురెడ్డి, సూపర్‌వైజర్ స్వప్న, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

అందె గ్రామంలో..

మిరుదొడ్డి, ఏప్రిల్ 22: మండలంలోని అందెలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణపక్ష మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం

దుబ్బాక, ఏప్రిల్ 22: ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా దుబ్బాక ఎంపీడీవో వేలేటి భాస్కరశర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం దుబ్బాక ఎంపీడీవో కార్యాలయంలో భాస్కరశర్మను పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి నరేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షులు లింగంపల్లి మురళి, కార్యదర్శులు రవికుమార్, రవీందర్‌రెడ్డి, వజ్ర, శిరీష్ పాల్గొన్నారు.

భాస్కరశర్మను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు, తదితరులు

మూగజీవాలు, పక్షులను కాపాడుదాం

పక్షుల కోసం మట్టి పాత్రలను ఏర్పాటు చేస్తున్న ఏబీవీపీ నేతలు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 22: మూగజీవాలను, పక్షులను కాపాడుకుందామని ఏబీవీపీ నగర్ స్టూడెంట్ ఫర్ డెవలపమెంట్ కన్వీనర్ ఝాన్సీ పిలుపునిచ్చారు. ఏబీవీపీ సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో మూగజీవాలు, పక్షుల దాహం తీర్చేందుకు మంచినీటితో కూడిన మట్టిపాత్రలు ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఏబీవీపీ కేవలం విద్యారంగ సమస్యలపై పోరాడడమే కాకుండా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైష్ణవి, ప్రణయ్ కుమార్, లక్ష్మీపతి, ఫణీందర్, పరశురాం, హరికృష్ణ, అనీష్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం ఆచూకీ లభ్యం

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 21: మండలంలోని జిల్లెలగడ్డలో ఈనెల 17న సాయంత్రం ఓ వ్యవసాయ బావిలో గుర్తించిన మృతదేహం ఆచూకీ మంగళవారం లభ్యమైంది. మృతిచెందిన వ్యక్తి పేరు సాయిప్రసాద్ అని, అతడిది ములుగు జిల్లా వెంకటాపురంగా పోలీసులు గుర్తించారు. మృతుడి భార్య దీపిక తన ప్రియుడితో కలిసి సాయిప్రసాద్‌ని హత్యచేసి వ్యవసాయ బావిలో పడేసినట్లుగా గుర్తించారు. వ్యవసాయ బావిలో గుర్తించిన మృతదేహానికి పోలీసులు పోస్ట్‌మార్టం నిర్వహించి అంత్యక్రియలు చేశారు.

మహానందిలో మల్లుపల్లి వాసి ఆత్మహత్య

మిరుదొడ్డి, ఏప్రిల్ 22 : ఆంధ్రప్రదేశ్‌లోని మహానందిలో మిరుదొడ్డి మండలం మల్లుపల్లికి చెందిన వ్యక్తి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం...మల్లుపల్లికి చెందిన మాల చిన్న బోజరాజు (36) కేబుల్ ఆపరేటర్ పనులు చేసేవాడు. ఈనెల 18న కేబుల్ ఆపరేటర్లు అందరూ కలిసి విహారయాత్రలకు వెళ్లారు. మహానందిలో చిన్న బోజరాజు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సుమలత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలి

గజ్వేల్, ఏప్రిల్ 22: తడి, పొడిచెత్తపై ఇంటింటా అవగాహన కల్పించి మంగళ, శుక్రవారాల్లో పొడి చెత్త, మిగతా రోజుల్లో తడి చెత్త అందించేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య తెలిపారు. మంగళవారం డంపింగ్ యార్డు, డీఆర్‌సీసీని పరిశీంచారు. అనంతరం డ్రైవర్లు, శానిటేషన్ జవాన్లు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లతో ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికి చెత్త సేకరణ చేసేటప్పుడు తడి, పొడి చెత్త వేరుచేసి ఇచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. చెత్త సేకరణ విషయంలో పట్టణంలో ఎలాంటి సమస్య లేకుండా చూడాలన్నారు. డీఆర్‌సీసీలోని మెటీరియల్‌ను వెంటనే రీసైక్లింగ్‌కి పంపించాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే హవా

- ఇంటర్ మొదటి, ద్వితీయ రెండింటిలోనూ బాలికలదే పై చేయి..
- మొదటి సంవత్సరంలో 51.35 శాతం ఉత్తీర్ణత..
- ద్వితీయ సంవత్సరంలో 59.29 శాతం ఉత్తీర్ణత..
- ఫస్టియర్‌లో బాలురు 38.00 బాలికలు 61.30 శాతం ఉత్తీర్ణత..
- సెకండియర్‌లో బాలురు 47.05, బాలికలు 68.31 శాతం ఉత్తీర్ణత..
- రాష్ట్రంలో ఫస్టియర్ ఫలితాల్లో సిద్దిపేట జిల్లా 30వ స్థానం..
- రాష్ట్రంలో సెకండియర్‌లో సిద్దిపేట జిల్లా 31వ స్థానం..

రాష్ట్రస్థాయి టాపర్‌గా వైష్ణవి

తల్లిదండ్రులతో రాష్ట్రస్థాయి టాపర్ వైష్ణవి

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 22: హుస్నాబాద్ పట్టణానికి చెందిన విద్యాకుసుమం రాధారపు వైష్ణవి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో టాపర్‌లో ఒకరుగా నిలిచింది. పట్టణంలోని ఆరపల్లికి చెందిన రాధారపు అయిలయ్య, జ్యోతిలకు చెందిన పెద్ద కూతురు వైష్ణవి చిన్న నాటినుంచే ఆయా ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యనభ్యసిస్తున్నది. మంగళవారం వెల్లడించిన ఇంటర్‌ఫలితాల్లో ఎంపీసీకి చదువుతున్న రాధారపు వైష్ణవి 470మార్కులకుగాను 468 మార్కుల సాధించి రాష్ట్రస్థాయి టాపర్‌గా నిలిచింది. వైష్ణవి ప్రస్తుతం సిద్దిపేట జిల్లా ఎన్‌సాన్‌పల్లిలోని టీజీఆర్‌జేసీలో ఇంటర్ చదువుతున్నది. వైష్ణవిని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్, రాజయ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ వెంకటరమణ, శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు.

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 22: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. ఈసారి కూడా సిద్దిపేట జిల్లాలో ఇంటర్ ఫలితాల్లో బాలికల హవా కొనసాగింది. బాలుర కంటే బాలికల ఉత్తీర్ణత శాతం అధికంగా ఉంది. ఇంటర్ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరంలోనూ బాలికలే పైచేయి సాధించారు. మార్చి 5న ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు మార్చి 25న ముగిసాయి. సిద్దిపేట జిల్లాలో జనరల్ విభాగంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 51.35 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా.. ద్వితీయ సంవత్సరంలో 59.29 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా ఫస్టియర్ ఫలితాల్లో 30వ స్థానంలో ఉండగా.. సెకండియర్ ఫలితాల్లో 31వ స్థానంలో నిలించింది. ఇంటర్ పరీక్షలకు సంబంధించిన రీ వెరిఫికేషన్, రీకౌంటింగ్‌తో పాటు సప్లిమెంటరీ పరీక్షలకు సైతం నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

సత్తాచాటిన బాలికలు..

మంగళవారం వెలువడ్డ ఇంటర్ ఫలితాల్లో సిద్దిపేట జిల్లాలో బాలికలు సత్తా చాటారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ఫస్టియర్‌లో 7,170 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 3,682 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా 51.35 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో 3,012 మంది బాలురకు 1,133 మంది ఉత్తీర్ణత సాధించగా 38.00 ఉత్తీర్ణత శాతం, బాలికలు 4,158 మంది పరీక్ష రాయగా..61.30 శాతంతో 2,549 మంది ఉత్తీర్ణులయ్యారు. అదే విధంగా ఇంటర్ సెకండియర్‌లో మొత్తం జిల్లా వ్యాప్తంగా 6,983 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 4,140 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై.. 59.59 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో 2,963 బాలురకు గానూ 1,394 మంది ఉత్తీర్ణులు కాగా 47.05 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. 4,020 మంది బాలికలకు గానూ 68.31 శాతంతో 2,746 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ రెండింటిలోనూ బాలికలే పై చేయిగా నిలిచారు.

ఒకేషనల్ ఇంటర్‌లో..

జిల్లా ఒకేషనల్ ఇంటర్ మొదటి సంవత్సరంలో మొత్తం 2,621 మంది విద్యార్థులకు 1,360 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై.. 52.00 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో 1,515 మంది బాలురకు 37.95 శాతంతో 575 మంది ఉత్తీర్ణులయ్యారు. 1,106 మంది బాలికలకు 70.98 శాతంతో 785 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ సెకండియర్ ఒకేషనల్ విభాగంలో 2,234 మంది విద్యార్థులకు 1,350 మంది ఉత్తీర్ణులై.. 60.43 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో బాలురు 1,227 మంది 43.36 శాతంతో 532 మంది పాసయ్యారు. 1,007 మంది బాలికలకు 81.23 శాతంతో 818 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ ఫలితాల్లోనూ బాలికలదే హవా కొనసాగింది. ఇంటర్ మొదటి సంవత్సరం ఒకేషనల్ ఫలితాల్లో రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా 23వ స్థానంలో ఉండగా.. సెకండియర్ ఒకేషనల్ ఫలితాల్లో 32వ స్థానంలో ఉంది.

మే 22 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు..

మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులకు మే 22వ తేదీ నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ థియరీ పరీక్షలు, జూన్ 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. నేటి నుంచే రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు అవకాశం కల్పిస్తామని తెలిపారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈనెల 30వరకు గడువు విధించినట్లు అధికారులు తెలిపారు.

అగ్నివీర్‌కు ఎంపికైన రైతుబిడ్డ

తల్లిదండ్రులతో శ్రీనివాస్ యాదవ్

నంగునూరు, ఏప్రిల్ 22: రైతుబిడ్డ కష్టపడి ఆర్మీలో ఉద్యోగం సాధించాడు. మండలంలోని కొండంరాజ్‌పల్లికి చెందిన బండి లక్ష్మీ-తిరుపతి దంపతుల కుమారుడు శ్రీనివాస్ యాదవ్ చిన్న వయసు నుంచే ఆర్మీలో ఉద్యోగం సాధించాలనే పట్టుదల ఉండేవాడు. అందుకు తగ్గట్టుగా కష్టపడి ఆర్మీ నియామక పరీక్షలకు హాజరయ్యాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో బండి శ్రీనివాస్ యాదవ్ ఆర్మీలో ఉద్యోగం పొందాడు. శ్రీనివాస్‌ను పలువురు గ్రామస్తులు, నాయకులు అభినందించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

మిరుదొడ్డి,(అక్బర్‌పేట-భూంపల్లి), ఏప్రిల్ 22: విద్యార్థులు కష్టపడి చదివి కలలు సాకారం చేసుకోవాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం రాత్రి అక్బర్‌పేట భూంపల్లి మండలం భూంపల్లి ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన బక్కి వెంకటయ్య మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరినప్పుడు సమాజంలో వారికి, వారి కుటుంబానికి తగిన గౌరవం దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు రాయపోల్ స్కూల్ 60వ వార్షికోత్సవం

రాయపోల్, ఏప్రిల్ 22 : రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్‌ఎస్) బుధవారం 60వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నారు. 1954లో స్థాపించబడిన ఈ పాఠశాలలో ఎందరో విద్యార్థులు చదువుకున్నారు. అనేక మంది విద్యార్థులకు ఈ పాఠశాల విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులను చేసింది. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు అనేక రంగాల్లో మంచి స్థానాల్లో స్థిరపడ్డారు. ఇస్రోలో ఏపీజే అబ్దుల్ కలాం టీమ్‌లో పనిచేసిన శాస్త్రవేత్తల్లో రాయపోల్ పూర్వ విద్యార్థులు ఉన్నారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవం

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 22: మద్దూరు మండల కేంద్రంతో పాటు రేబర్తిలో పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో వరదరాజు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 22: పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట్ల పరశురాములు అన్నారు. ఈనెల 25న హైదరాబాద్‌లో తలపెట్టిన భవన నిర్మాణ రంగాల కార్మికులకు రాష్ట్ర సమావేశం నేపథ్యంలో మంగళవారం సిద్దిపేటలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని విస్మరించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను మరిచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

టెండర్లు వాయిదా

చేర్యాల, ఏప్రిల్ 22: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో మంగళవారం ఈవో అన్నపూర్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సీల్డు టెండర్, బహిరంగ వేలంలో కొన్ని ఖరారు కాగా, మరికొన్ని వాయిదా పడ్డాయి.రాతి గీరల వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపు నంబర్ 25కు సంవత్సర కాల పరిమితికి నెలకు రూ.10,300కు, అన్నదాన సత్రం వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపు నెంబర్ 5కు సంవత్సర కాలపరిమితికి నెలకు రూ.5,650 చొప్పున ఖరారు అయ్యాయి. ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్ కోసం నిర్వహించిన టెండరులో ఆరోహి సర్వీస్‌వారు రూ.15 వేల చొప్పున లోయెస్ట్ రేట్ కోడ్ చేశారని తెలిపారు.మిగిలిన టెండర్లను తిరిగి నిర్వహించే తేదీ త్వరలో ప్రకటిస్తామని ఈవో తెలిపారు.

విద్యార్థులకు సమ్మర్ క్యాంపు

బెజ్జంకి, ఏప్రిల్ 22: బెజ్జంకిలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 24 నుంచి మే 3 తేదీ వరకు నిర్వహించే సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో మహతిలక్ష్మీ ఒక ప్రకటనలో కోరారు. ఈ క్యాంపులో వొకేషనల్, యోగా, ఇంగ్లిష్ స్పీకింగ్, పాటలు, హ్యాండ్ రైటింగ్, ఆటలు,డ్రాయింగ్ అంశాలపై శిక్షణ ఇస్తామని, ఆసక్తిగల విద్యార్థులు పాఠశాలలో పేరు నమోదు చేసుకోవాలని ఇతర వివరాలకు 9490094368, 9491951492 సంప్రదించాలని కోరారు.

బావిలో నీటమునిగి వ్యక్తి మృతి

కొమురవెల్లి, ఏప్రిల్ 22 : కొమురవెల్లికి చెందిన గొల్లపల్లి కనకయ్య(50) కుటుంబంతో హైదరాబాద్‌లో జీవనం సాగిస్తున్నాడు. మనుమడి దావత్ కోసం బంధువులతో గ్రామానికి వచ్చి మంగళవారం సాయంత్రం గ్రామశివారులోని బావిలో ఈత కోసం దిగిన కనకయ్య ప్రమాదశాత్తు నీట మునిగి మృతిచెందాడు. కొమురవెల్లి ఎస్సై రాజు, స్థానికులతో కలిసి మృతదేహాన్ని బయటకు వెలికితీశారు. మృతుడికి భార్య యాదమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు.

రామభక్తిని చాటుకోవడం అభినందనీయం

ముత్యాల తలంబ్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 22: గజ్వేల్ పట్టణంలోని సీతారామ ఉమామహేశ్వరుల కల్యాణోత్సవానికి భద్రాచలం ముత్యాల తలంబ్రాలను అందించి రామభక్తిని చాటుకోవడం అభినందనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి జరిగే కల్యాణోత్సవానికి తలంబ్రాలను ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా రామకోటి రామరాజు దంపతులు ఆలయ నిర్వాహకులకు అందజేశారు. గోటితో వలిచిన తలంబ్రాలను అందించేందుకు కృషి చేసిన ఆయన్ని వారు అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, సామాజిక సమరసత రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌బాబు, శ్రీధర్‌రావు, జితేందర్, ఎన్సీ శ్రీను, నర్సింగరావు, సురేశ్, హరిణి, నర్సింలు, రవి తదితరులు పాల్గొన్నారు.

దళితరత్న అవార్డు గ్రహీతకు సన్మానం

బొజ్జ యాదగిరిని సన్మానిస్తున్న నాయకులు

నంగునూరు, ఏప్రిల్ 22: దళిత జన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బొజ్జ యాదగిరికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం దళిత రత్న అవార్డు బహూకరించింది. మంగళవారం నంగునూరులో బీఆర్‌ఎస్ నాయకుడు కరెడ్ల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నంగునూరు, ఘనపూర్ గ్రామాల నాయకులు బొజ్జ యాదగిరిని సన్మానించారు. కార్యక్రమంలో దళిత జన సమితి నాయకులు రమేశ్, మాజీ ఏఎంసీ చైర్మన్ పురేందర్, నాయకులు రామ్‌రెడ్డి, మల్లేశం, తిరుపతి, రాజమౌళి, బాలరాజు, బాబు, నరేశ్, ఐలయ్య, రమేశ్ పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కష్టపడి చదవాలి

- డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

వార్షికోత్సవంలో అలరించిన చిన్నారులు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 22: విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని, వాటి సాధనకు కష్టపడి చదవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మద్దూరు మండలంలోని గాగిల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం బైరగోని హరిప్రసాద్ అధ్యక్షతన పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. వార్షికోత్సవానికి హాజరైన డీఈవో మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. గాగిల్లాపూర్ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో వరదరాజు, కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్‌శర్మ, ఏఏపీసీ చైర్మన్ కనకమ్మ, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో వార్షికోత్సవం..

మద్దూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం ప్రిన్సిపాల్ గణేశ్ అధ్యక్షతన పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ఏజీ రహీం మాట్లాడుతూ.. ఉజ్వల భవిష్యత్ కోసం విద్యార్థులు కష్టపడి చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్, ఎంఈవో వరదరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూజీడీ పనులు ప్రారంభం

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు

సిద్దిపేట, ఏప్రిల్ 22: మెరుగైన పారిశుధ్య నిర్వహణకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) ఎంతగానో దోహదపడుతుందని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు అన్నారు. మంగళవారం సిద్దిపేటలోని 7వ వార్డులో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్ శ్రీదేవి బుచ్చిరెడ్డితో కలిసి యూజీడీ పనులను ఆమె ప్రారంభించారు. 8వ వార్డులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులను పరిశీలించి, వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. అనంతరం బాలవికాస్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ పృథ్వీరాజు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

జాలపల్లిలో రాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న అధికారులు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 22: ధూళిమిట్ట మండల కేంద్రంతో పాటు జాలపల్లిలో వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను మంగళవారం తహసీల్దార్ మధుసూదన్, ఏవో అఫ్రోజ్ పరిశీలించారు. ధూళిమిట్ట, జాలపల్లి, బెక్కల్, తోర్నాల గ్రామాల్లో వడగండ్ల వర్షానికి 143 మంది రైతులకు చెందిన 125 ఎకరాల వరి పంట, 15 మంది రైతులకు చెందిన 33 ఎకరాల మామిడి తోటలు దెబ్బతిన్నట్లు గుర్తించామని తహసీల్దార్ తెలిపారు. నష్టం వివరాలను జిల్లా అధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చొప్పరి వరలక్ష్మీసాగర్, మాజీ ఎంపీటీసీ చెట్కూరి కల్యాణీకమలాకర్, పీఏసీఎస్ డైరెక్టర్ నారోజు శ్రీనివాస్ ఉన్నారు.

ఆలయానికి ముస్లిం యువకుడు విరాళం

అర్చకులకు విరాళాన్ని అందజేస్తున్న అజీజ్‌పాషా

మర్కూక్, ఏప్రిల్ 22: మండలంలోని వరదరాజ్‌పూర్‌లో గల భూనీల సమేత వరదరాజ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఎర్రవల్లికి చెందిన ముస్లిం యువకుడు అజీజ్‌పాషా రూ.11,111 విరాళం ఇచ్చి దాతృత్వాన్ని చాటుకున్నాడు. విరాళం డబ్బును మంగళవారం ఆలయ అర్చకులకు స్థానిక నాయకులతో కలిసి ఆయన అందచేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి అజీజ్‌పాషాను అభినందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో లక్కాకుల నరేశ్, అప్పాల ప్రవీణ్ కుమార్, అర్చకులు వేణుగోపాల్‌చారి, తుమ్మ కృష్ణ, నరేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్

సిద్దిపేట, ఏప్రిల్ 22: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని, ప్రజలు, వ్యవసాయ కూలీలు, రైతులు, కార్మికులు బంద్‌లో పాల్గొనాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ కోరారు. మంగళవారం సిద్దిపేటలోని సంఘం జిల్లా కార్యాలయం కార్మిక కర్షక భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు కొంగరి వెంకట మావో అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాని నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. భూమిలేని ప్రతి కూలీకి రూ.12 వేలు ఇస్తామని, పట్టణాల్లో ఉపాధి కూలీలకు 150 రోజులు పని కల్పిస్తామని, రూ.400 రూపాయలు రోజు వేతనం ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానం చేసి నేటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. రాళ్లబండి శశిధర్, తాడూరు రవీందర్, గొర్రె శ్రీనివాస్, తాటోజు రవీంద్రచారి, బాలకిషన్, బోయిన మల్లేశం, శాతరాసి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

బడిబాట కరపత్రాలు ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎంలు

చేర్యాల, ఏప్రిల్ 22: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, తల్లిదండ్రులు వారి పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలని కడవేర్గు కాంప్లెక్స్ హెచ్‌ఎం టీఎన్ చంద్రశేఖరరావు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కాసం ఉమారాణి కోరారు. మండలంలోని కడవేర్గులో మంగళవారం విద్యార్థుల నమోదు కోసం ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల బడిబాట కరపత్రాన్ని కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు రమేశ్, అరుణ, మమత, రామకృష్ణ, ఇంద్రాసేనారెడ్డి, కొడిపల్లి ప్రశాంత్‌కుమార్, బుచ్చయ్య, అజయ్‌కుమార్, వేణుగోపాల్, కె.ప్రశాంత్‌కుమార్, సీఆర్పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి.. యువకుడు మృతి

బాబు మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

దుబ్బాక, ఏప్రిల్ 22: దుబ్బాక మండలం చీకోడులో మంగళవారం చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు యువకుడు నీటమునిగి మృతిచెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. చీకోడుకు చెందిన తౌడ బాబు (26) మంగళవారం తన మిత్రులు అజయ్, రంజిత్‌తో కలిసి ఈత కొట్టేందుకు గ్రామ శివారులోని పెద్దచెరువు వద్దకు వెళ్లాడు. ఈత కొడుతూ బాబు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. ఒక్కగానొక్క సంతానమైన బాబు ప్రమాదవశాత్తు మృతిచెందడంతో తల్లిదండ్రులు భూదవ్వ ఏగొండల రోదనలు అందరినీ కంట తడిపెట్టించాయి. దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు.

రైతులకు మేలుచేసేలా చట్టాలు తేవాలి


దుబ్బాక: మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

దుబ్బాక, ఏప్రిల్ 22 : దేశానికి రైతుల వెన్నముక అని, రైతులకు ప్రయోజనకరమైన చట్టాలను ప్రభుత్వాలు తీసుకురావాలని, వాటిని నిస్వార్థంగా అమలు చేయడంలో అధికార యంత్రాంగం కృషి చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం దుబ్బాక ఐవోసీ కార్యాలయంలో భూభారతి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిద్దిపేట ఆర్డీవో సదానందం భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. భూభారతి ద్వారా భూ సమస్యలను త్వరితగతిగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ భూములతో పాటు గ్రామ కంఠంలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించే అవకాశం ఉందన్నారు. తహసీల్దార్‌లకు, ఆర్డీవో, కలెక్టర్‌లకు అధికారం కల్పిస్తున్నందున, రైతులకు సమస్యల పరిష్కారంతో పాటు సత్వర న్యాయం చేకూరుతుందన్నారు. భూ వివాదంతో కోర్టుల చుట్టూ తిరగాల్సిన పని ఉండదన్నారు. దుబ్బాక తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంపీడీవో భాస్కరశర్మ, ఏవో ప్రవీణ్, ఆర్ఐ నరేందర్ పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి భూభారతి

మిరుదొడ్డి(అక్బర్‌పేట-భూంపల్లి) ఏప్రిల్ 22: గ్రామాల్లో నెలకొన్న భూసమస్యలు పరిష్కరించడానికి భూభారతిని ప్రభుత్వం తీసుకువచ్చిందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం అక్బర్‌పేట భూంపల్లిలో భూభారతి చట్టంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. రైతులు తమ భూసమస్యలను భూ భారతి చట్టం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో పాల్గొన్నారు.